గ్రాట్యూటీ డబ్బులు లక్షన్నర చిల్లర వచ్చినట్టే గాని... అల్లుడు బాకీపడ్డ కట్నంకింద కాచుక్కూచొని పట్టుకెళ్లిపోయిండు. జి.పి.ఎఫ్. డబ్బుల కోసం జిల్లా పరిషత్ చుట్టూ ఇంకా తిరుగుతూనే వున్నాను. పరిస్థితి వివరించినా నోటితో సానుభూతి తెలిపారు తప్ప... చేతల్లో ముందుకు రాలేదు. ఆరు పైసల వడ్డీకన్నా... వాడి కులం కన్నా నా భార్య ప్రాణాలు నిలిపింది వాడేనయ్యా..." అన్నాడు.

"అదికాదు మాస్టారూ... వాడు రెండు పైసల మిత్తికి అప్పుతీసుకోండ్రని వూరంత తిరిగినా ఎవరూ వానిదగ్గర తీసుకోరు... మీకు తెలువదా?" మరో ఆసామి అన్నడు.

"మీది పరువుగల్ల కుటుంబం, వూరంత మీకు నమస్కరించెటోల్లె తప్ప... మీ గురించి ఎనాడైనా ఎదిరిచ్చి మాట్లాడేటోల్లు కన్పిచ్చిండ్రా సారూ...." ఇంకో పెద్ద మనిషి అన్నడు.

"నాకిప్పుడు వూర్లో వాళ్లిచ్చే గౌరవం కన్నా... నా భార్య ప్రాణాలు ముఖ్యమయ్యాయి. ఆపదలో ఆదుకున్నదే నిజమైన గౌరవం అనే ఒక జీవిత సత్యం అనుభవపూర్వకంగా తెల్సుకున్నాను."

"ఆరుపైసల వడ్డీ తీసుకుంటున్నప్పుడు వాడిచ్చేది గౌరవమెట్లా అవుతుంది సారూ" సర్పంచి అన్నడు.

"నేను వడ్డీలు లెక్కించలేదు... వాడు ఆపదలో అప్పిచ్చి ఆదుకున్నడు. నేను దాన్ని గౌరవంగానే భావిస్తున్నాను" రామయ్యసార్ చెప్పిండు.

"మీదేమో సాంప్రదాయాల కుటుంబం. మా బాధంతా అదికాదు.. నెల రోజుల గడువులో మీరు అప్పు తీర్చకపోతే వాడు వసూలు చేసుకునే తీరుకు

మీరు బతికి వుండరేమోనని భయం... " మరో పెద్దమనిషి అన్నడు.

ఆ మాటకి రామయ్య నవ్వుకున్నాడు.

"వాడికి డబ్బు ఇచ్చే రోజు పొద్దున్నే వచ్చి అడుగుతడు. ఏ కొంచెం లేటయితుందన్నా... తిట్ల పారాయణం మొదలుపెడుతడు. జీవితంలో వినని బూతులవి. ఆ బూతులకే సగం చచ్చిపోతం... ఈలోపు ఇరవై, ముప్పయ్ పందుల్ని తీసుకొచ్చి ఇంట్లో తోలుతడు.... గుర్రు గుర్రు మనుకుంట ఇంట్ల అవి చేసే హడావిడికి బిక్కచచ్చిపోతం... అటెనుక వాడి ఇద్దరి పెండ్లాల్ని తీసుకొచ్చి నట్టింట్లో మల విసర్జన చేయిస్తాడు... దాంతో నిజంగానే మనం చచ్చిపోవాల్సిందే. మీరెంతటి పరువుగల వాళ్లో మాకు తెల్సు కాబట్టి... మీ గురించి ఆందోళన పడుతున్నం." అన్నాడో యువకుడు.

రామయ్యకి వాళ్ల మాటలు అప్పుకంటే భయంకరంగా కన్పిస్తున్నాయి.

"అనుకున్న రోజు వడ్డీతోని ఇవ్వకపోతే శివతాండవం చేస్త అని ఓ వార్నింగ్ ఇస్తాడు. వాడి నీచపు పనికి ఓ పేరు కూడా..." నవ్విండు ఉప సర్పంచి.

"ఎందుకైనా మంచిది... మీ జి.పి.ఎఫ్ డబ్బులేవో తొందరగా వచ్చేటట్టు చేసుకోండ్రి. మీకేదైన అవమానం జరిగితే మాక్కూడా బాధనిపిస్తది" అంటూ సలహాలిచ్చిండ్రు.

రామయ్య మరోసారి నిట్టూర్చిండు. ఇంకా పదిహేను రోజులు వాయిదుంది. జి.పి.ఎఫ్ డబ్బుల కోసం రేపు మరోసారి జిల్లా కేంద్రానికి పోయి రావాలె అనుకొని... ఇంటిదిక్కు నడిచాడు.

పెరట్లోని బాయికాడ కాళ్లు కడుక్కొని వచ్చి... భోజనానికి కూచున్న

రామయ్య మనసంతా ఆవేదనగా... అసహనంగా... ఆందోళనగా మారింది.

"వాడి బాకీ... అనుకున్న గడువుకంటె రెండ్రోజుల ముందే తీర్చేయ్యాలి" అప్పటికి... ఆ మాట అనుకోవటం నూటపదమూడోసారి.

అన్నం ముద్ద నోట్లో పెట్టుకోబోతున్నోడల్లా. ఇంటినిండా పందులు తిరుగుతున్నట్టు... అన్పించి వణికిపోయాడు. వాడి భార్యలు నట్టింట్లో... ఊహించలేక... అన్నం రోత పుట్టి... పల్లెంలోనే చేయి కడిగేసుకున్నాడు.

తలెత్తి భార్య కళ్లలోకి చూసాడు.

సుభద్ర కళ్లనిండా నీళ్లు...

"ఏమైంది సుభద్రా... మల్లా నొప్పిగాని వస్తుందా?" అనడిగాడు ఆందోళనగా కొంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ... తల అడ్డంగా ఊపింది.

"మరేమైందీ..." అన్నాడు కంగారుగా

"అరవైవేలు... అప్పు..." అంది దుఃఖాన్ని దిగమింగుకుంట.

రామయ్య తేలిగ్గా కొట్టి పారేస్తూ "అప్పు గురించి నీకెందుకమ్మా పరేశాను... నేను చూసుకుంట కదా" అన్నాడు.

"అది కాదు... అప్పు తీర్చకపోతే ఆ ఎరుకలోల్లు పందుల్తో వచ్చి లొల్లి లొల్లి చేస్తరట గదా" అంది సుభద్ర భయంగా.

"నీకెవలు చెప్పింద్రమ్మా...?"

"వూర్లె ఆడోల్లు ముచ్చెట్లు పెట్టుకుంటే... సుశీలమ్మ వచ్చి చెప్పింది"

బక్కడు బండబూతులు తిడుతున్నటు... ఇల్లంతా పందులు తిరుగుతున్నట్టు... వాడి పెళ్లాలు నట్టింట్ల మల విసర్జన చేస్తున్నటు... కలల్లోనూ.. వూహల్లోనూ గడగడలాడిపోయారు. చావొక్కటే శరణ్యమా... అన్న ఆలోచన.

తెల తెలవారింది.

రామయ్యసారుకి బక్కడి అడుగుల చప్పుడు విన్పించినట్టు... అదిరిపాటు, ఉలికిపాటు... సుభద్రమ్మ బెదురుకళ్లతో గుండె దడదడలాడుతుంటె తలుపు దిక్కే చూస్తుంది.

సాయంత్రమైనా... వాడు రాలేదు.

రామయ్య మనసు నిండా అనుమానాలు... వాడు గడువు రోజుని మర్చిపోయిండా? లేక వూర్లె లేడా ? వాడి పందులకేమైనా అయిందా? బాగా తాగి ఎక్కడన్నా పడిపోయిండా??

రెండో రోజు... మూడోరోజు... నాలుగోరోజు... ఇలా వారం జరిగింది.

రామయ్యసారు కొంచెం ధైర్యంగా కాలు బయటపెట్టిండు. అందరిలోనూ బాకీ ముట్టజెప్పిండ్రా అన్న సందిగ్ధ చూపులే తప్ప... కదిలించే సాహసం ఎవలూ చేయట్లేదు. డబ్బు సర్ధమంటాడేమోనన్న భయం.

రామయ్య జిల్లా కేంద్రానికి వెళ్లిండు. ఆరోజు... అనుకోకుండా జి.పి.ఎఫ్. డబ్బులు చేతికందినయ్. నిండా ఊపిరిపీల్చుకున్నడు.

**- 3 -**

అప్పటికి... పదమూడో రోజున వడ్డీతో సహ అరవైవేల రూపాయల్ని తీసికొని వూరవతలి ఎరుకల గుడిసెల దగ్గరికి నడిచిండు.

పందుల్ని కడుగుతున్న బక్కడు... రామయ్యసార్‌ని చూడంగనే నులకమంచమేసి పంచెతోని దులిపి 'కూసోండ్రయ్యా' అన్నడు వినయంగా...

"గడువు తేది దాటిపోయినా రాలేదేందిరా..." అన్నడు రామయ్య డబ్బు చేతుల్లో పెడుతూ... వాడు మాట్లాడలేదు... చిన్నగ నవ్వి తీసుకున్నడు.

"ఇవిగోరా... ఇవి వడ్డీ రూపాయలు" అని మరికొంత డబ్బిచ్చిండు రామయ్య . వాడు అవి తీసికొని కండ్లకద్దుకొని... తిరిగి రామయ్య చేతుల్లనే పెడుతూ "వద్దయ్యా... మీ అసోంటి గొప్ప మనసున్నోల్ల దగ్గర మిత్తి తీసుకుంటే పాపం తగుల్తాది" అన్నడు బక్కడు.

రామయ్య ఆశ్చర్యపోయిండు... అది గమనించిన బక్కడు "అయ్యా... చిన్న కులపోడు అప్పిచ్చుడేందని... తీసికున్నోల్లంతా ఎగవెట్టాలనే జూసిండ్రు. మొండి బాకీల్ని నేను నీచంగానే వసూలు చేసుకుంట కావచ్చు. కాని మీ అసోంటోల్లను గూడా గట్లనే జేస్తననుకుంటిరా..." అన్నడు.

వాడి మంచి మనసుకి... వాడిలోని నిర్మలత్వానికి... నిష్కల్మశానికి రామయ్య కండ్లు తడిగా మారినయ్. మల్లా బక్కడే చెప్పిండు.

"సర్పంచిగ గెల్సినంక ఆర్నెల్లల్ల బాకీ దీరుస్తరా అని ఎలచ్చనల్ల నలుపై వేలు తీసుకున్నడు సర్పంచి గంగమల్లు... అడిగినప్పుడల్లా దాటేసిండు. నిలదీసి అడిగినందుకు... పోరుగూర్లె మెదడు వాపు రోగమస్తందని... వూర్లెకచ్చిన నా పందుల్ని సుంకరోల్లతోని వేటాడి చంపిచ్చిండు. పందుల్ని కుట్టిన దోమలు మనుషుల్ని కుడితె చచ్చిపోవుడేనని వూరోల్లని ఎగేసిండు.. అప్పు ఎగవెట్టిండు... అంటరానోడు అప్పిచ్చినా లోకువే... ఈ లోకంల" అన్నడు బాధగా.

"పదకొండు పందుల్ని చంపింండ్రు... మా అంటరాని జీవాలు.. వూరోల్ల అశుద్ధాన్ని తింటయిగావచ్చునయ్యా... కాని ఆల్ల మనసుల్ల వున్న అశుద్ధాన్ని ముక్కుతోనైనా వాసన చూసుటానికి ఇట్టపడయ్... అవి చెట్లు చేమలు తినయయ్యా... పచ్చదనాన్ని కాపాడుతయ్... అవ్వి అశుద్ధాన్ని తిని పరిశుభ్రతను కాపాడుతయ్. అయినా మా పందిజాతి అంటరానిదైంది..." వాడి కళ్లల్లో సన్నటి కన్నీటి తెర... ఎండపొడకి జిగేల్‌మంది.

"ఎనుకట ఈ వూరిని ఏలిన హన్మంతరావుదొర కూడా ఇంటి పక్కకు పందులు పోతే మమ్ముల్నీ, మా కులాన్నీ బండ బూతులు తిడుతుండె... ఇయ్యాల్ల పట్నంల ఆయినే సీమ పందుల్ని పెంచుకుంట అమ్ముతుండు"

వాడి మాటలకు రామయ్యసారు శిలా విగ్రహం లెక్క అయిపోయిండు. వాడిలోని సంఘర్షణ బయటకు చెప్పుకునే అవకాశం మొదటిసారి దొరికింది.

"పంది తల్లిని ఓ పోరడు కొడితే... అది గుర్రుమనుకుంట మీదబడి కరిచిందని పంచాది పెట్టి... నా దగ్గర నాలుగువేలు జుర్మాన తీసింండ్రు గాని... దాని తల్లి మనసునర్థం జేసుకోలే... ఊరోల్లకు బాకీలిత్తన్నమని ఎన్నడు మిడిసిపడలేదయ్యా... మా బాకీ ఎగ్గొట్టాలనుకునేటోల్ల ఇండ్లల్లనే పందుల్ని తోలుతం..."

వాడి కన్రెప్పల కింద ఉప్పెనలా పొంగుతున్న వేదన...

"మీకు చెప్పెటోన్ని కాదయ్యా... అదేందోగాని బాకి అనంగనే అందరికి డబ్బే యాదికస్తది... కాని డబ్బుదేముందయ్యా...

ఓ మనిషి మరో మనిషికి... ఒదార్పు బాకీ పడాలె.

